విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 16 ఆగస్టు 2024 8 పేజీలు

ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తాం

స్వాతంత్ర్య వేడుకల్లో గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజల రేపటి ఆకాంక్షలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో గురువారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర సముపార్జన కోసం సర్వం త్యాగం చేసిన ఆనాటి అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో నేటి యువత దేశాభి వృద్ధికి కృషి చేయాలన్నారు. పేదల ఆశలు నెరవేరడానికి తగు అవకాశాలు కల్పించే శీఘ్రతర, సమగ్ర ఆర్థికాభి వృద్ధికి పటిష్టమైన విధానాలను అమలు చేస్తామన్నారు. తద్వారా సంపద సృష్టితో సంక్షేమ పథకాల విస్తృత అమలును పటిష్టం చేయనున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు రూ.2 వేల 284 కోట్లు పంట రుణాలుగా అందించామని, 12 వేల 205 మంది కౌలు రైతులకు రూ.82 కోట్లను పంట రుణాలుగా అందించామన్నారు.జిల్లాలో మరింత మంది కౌలు రైతులను గుర్తించి, వారికి సాగుదారుల హక్కు పత్రాలను అందించి, మరింతగా పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.సూక్ష్మ సేద్య పథకంలో 15 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యమునకు రూ.98 కోట్ల సబ్సిడీతో స్ప్రింక్లర్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 2 లక్షల 66 వేల 867 మందికి ప్రతీ నెలా రూ.114 కోట్లను పెన్షన్లుగా అందిస్తున్నామని పెన్షన్ మొత్తాన్ని ▶మిగతా 2లో

స్వాతంత్ర్య స్ఫూర్తి చాటాలి

కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు.

78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వంద అడుగుల జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, వివిధ శాఖల అధికారులతో మీట నొక్కి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర దినోత్సవ కాంక్షను యువత, విద్యార్థులు, చిన్నారుల్లో రగిలించేలా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చేపడు తున్నట్టు తెలిపారు. త్రివర్ణ పతాకం ప్రతి ఇంటి మీద ఎగురవేసి స్వతంత్ర స్ఫూర్తిని చాటాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ట్రైని కలెక్టర్

హెచ్ఎస్ భావన, జిల్లా రెవిన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీవో పి.త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం. బాలసరస్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్, డీఎస్వో బీవీఎస్ ప్రసాద్, వికాస పీడీ కె. లచ్చారావు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలం స్వాతంత్ర్యం 4 లో..

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం 8 లో..

రాష్ట్రాభివృద్ధికి సమిష్టి కృషి

స్వాతంత్ర్య వేడుకల్లో జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

విశాలాంధ -భీమవరం: భీమవరం కలెక్టరేట్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలోని పోలీసు దళం మంత్రికి సెల్యూట్ సమర్పించగా, బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు ప్రత్యేక వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం అతిథి సభా వేదిక వద్దకు చేరుకొని త్రివర్ణ బెలూన్లను, శాంతి కపోతాలను గాలిలోకి ▶మిగతా 2లో

స్వాతంత్ర్య స్ఫూర్తితో ముందుకు సాగాలి

కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్లో అత్యంత ఘనంగా స్వాతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల స్ఫూర్తితో ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగ వేడుకలు నిర్వహించుకున్నామన్నారు.

ఆర్ట్స్ కాలేజీలో స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకలలో జిల్లా మంత్రి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సభ ప్రాంగణం చేరుకున్న మంత్రికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి. నరసింహ కిషోర్ స్వాగతం పలికారు. వేడుకలలో భాగంగా పోలీసు నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించారు.

మహనీయుల త్యాగంతో స్వాతంత్ర్య ఫలాలు

జిఎంసి బాలయోగి స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : బ్రిటీష్ దొరల పాలన నుండి భరతమాతకు విముక్తి కల్పించేందుకు ప్రాణాలొడ్డి పోరాడిన ప్రతి మహనీయుల్ని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి వాసం శెట్టి సుభాష్ పేర్కొన్నారు. స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే రక్షణగా దశాబ్దాల తరబడి సాగిన స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, త్యాగనిరతికి ఫలితమే మనకు దక్కిన స్వాతంత్ర్య ఫలాలన్నారు. జిల్లాను ప్రగతి పథంలో పయనింప చేయడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య పోరాటంలో అమరులై అశువులు బాసిన త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకుని నేటితరం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలుత మంత్రి వాసంశెట్టి సుభాష్ అమలాపురం జిఎంసి బాలయోగి స్టేడియంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. పోలీసు వర్గాల కవాతు గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గత ఏడాది సాధించిన అభివృద్ధి, ▶మిగతా 2లో

డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేరుతో ఫేస్‌బుక్ నకిలీ అకౌంట్

గూగుల్ పే ద్వారా డబ్బులు వేయాలంటూ మెసేజ్‌లు

కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు

విశాలాంధ్ర - కైకలూరు : ఫేస్‌బుక్ నకిలీ అకౌంట్లతో పలువురు ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్ అకౌంట్లున్న ప్రముఖుల పేర్లతో నకిలీ అకౌంట్లు సృష్టించి గూగుల్ పే ద్వారా డబ్బులు వేయాలంటూ మెసేజ్‌లు పెడుతూ మోసాలకు పాల్పడుతున్న వైనమిది. సాక్షాత్తూ కైకలూరు శాసనసభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేరు మీద ఓ ప్రబుద్ధుడు నకిలీ అకౌంట్ సృష్టించి ఆయన ఫాలోవర్స్, ఫ్రెండ్ రిక్వెస్టు పెట్టి గూగుల్ పే ద్వారా డబ్బులు ఆశిస్తూ మెసేజ్‌లు పెట్టడం చర్చానీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాల్లోకి వెళితే కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అనుచరుడు కొల్లి వీరవెంకట సత్యవరప్రసాదుకు బుధవారం ఫేస్‌బుక్ ఓ ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేరుతో ఉండటంతో వరప్రసాద్ ఫ్రెండ్ రిక్వెస్టును ఆమోదించాడు. ఆ వెంటనే యోగక్షేమాలతో మెసేజ్లు పెట్టి రూ.25 వేలు గూగుల్ పేద్వారా 84865 32607అనే నెంబరుకు వెంటనే పంపాలని, మరుసటి రోజు తిరిగి పంపేస్తానని మెసేజ్ పెట్టాడు. దీంతో అనుమానం వచ్చిన వరప్రసాద్ గూగుల్ పే నెంబరుకు రూ.100లు పంపాడు. సదరు నెంబరు రాహుల్సాహెూ అనే పేరు రావటంతో అనుమానం వచ్చి ఫేస్ బుక్ యాజమాన్యానికి రిపోర్టు చేశాడు. ఆ తరువాత ఇది నకిలీ అకౌంట్ అని గుర్తించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో రెవిన్యూ శాఖలో ఉత్తమ సేవలు అందించిన టి.సి.హెచ్.ఆర్ పాలెం గ్రామ రెవెన్యూ అధికారి ఖాదర్, ములగలంపాడు రెవిన్యూ

సహాయకుడిగా పనిచేస్తున్న బాబురావు సేవలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి నూజివీడు డివిజన్ ఆర్డిఓ భవాని శంకరి అవార్డులు, ప్రశంసాపత్రాన్ని అందచేశారు. అవార్డులందుకున్న వీరిని సహచర ఉద్యోగులు అభినందించారు.

పోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌కు ఉత్తమ సేవా అవార్డు

విశాలాంధ్ర -పోడూరు : ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలోను, శబరీ - గోదావరి వరదల సమయంలోను అల్లూరి జిల్లా వి ఆర్ పురం మండలం లో ఉత్తమ సేవలు అందించినందుకు పోడూరు తహసిల్దార్

సయ్యద్ మౌలానా ఫాజిల్ కు ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఎ యస్ ఆర్ జిల్లా పాడేరులో జరిగిన ఆగస్టు 15 వేడుకలలో సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ. ఎస్. దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. నర్సాపురం తహసిల్దారుగా , 2022, 2023ల లోను విఆర్ పురం తహసీల్దార్‌గా 2024 లోను వరుసగా 3 సంవత్సరములు హ్యాట్రిక్ అవార్డును అందుకోవడం పట్ల తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ను మండల స్థాయి అధికారులు రెవిన్యూ సిబ్బంది, మండల ప్రజా ప్రతినిధులు అభినందించారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - ముదినేపల్లి : వారం రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిన మహిళ కనిపించకపోవడంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసుగా ఫిర్యాదు నమోదైన సంగతి విధితమే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లికి చెందిన కోన నాగరాజు భార్య మహాలక్ష్మి భవాని (32)కి రెండేళ్ల కుమార్తె ఉంది. మహాలక్ష్మి భవాని ఈనెల 8న ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. పోలీసులు గాలించిన ఆచూకీ కోసం చూస్తుండగా దీనిపై మహిళ కుటుంబ సభ్యులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ను కలుసుకుని ఫిర్యాదు చేయడంతో జిల్లా పోలీసు యంత్రాంగం యుద్ధ ప్రాతిపాదికన సిసి పుటేజీల ద్వారా విజయవాడ రైవస్ కాలువ గట్టు ప్రాంతంలో పరిశీలించగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద కాలవలోకి దుమికిన లక్ష్మి కాలువ లాకుల వద్ద మృతదేహాన్ని గుర్తించారు. సమాచారాన్ని మృతురాలు కుటుంబ సభ్యులకు తెలిపారు. ముదినేపల్లి ఎస్సై డి.వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేడు మనం జరుపుకుంటున్న స్వాతంత్ర్య ఫలమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద, మున్సిపల్ ఆఫీస్ వద్ద, తాడేపల్లి గూడెం పెంటపాడు మండల పరిషత్ తహసీల్దారు కార్యాలయాల వద్ద, పడాల మార్కెట్ యార్డ్, తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద, తాడేపల్లిగూడెం మాజీ సైనిక్ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోయినా మేజర్ పంచాయతీకి 25,000 మైనర్ పంచాయతీకి 10,000 అందించి స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు కొత్త భాష్యం చెప్పారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మురళీ కృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు

(1వ పేజీ తరువాయి)

ప్రగతిని విశదీకరించారు. అనంతరం స్వేచ్ఛకు సూచికగా శాంతి కపోతాలను ఎగురవేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలైన గేయ నృత్యరూపక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విధి నిర్వహణలో భాగంగా విశిష్ట సేవలు అందించిన జిల్లా అధికారులు 8 మంది, ప్రభుత్వ విభాగాల్లో విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన సుమారు 245 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా, డిఆర్వో ఎం వెంకటేశ్వర్లు, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట ఆర్డీవోలు జి కేశవర్ధన్ రెడ్డి, ఎస్ సుధా సాగర్, జివివి సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషి

(1వ పేజీ తరువాయి)

వదిలారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రజలను ఉద్దేశించి సందేశాన్ని సభా వేదిక నుంచి చదివి వినిపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరులను ముందుగా స్మరించుకున్నారు. సమాజంలో అందరూ సత్సమానంగా ఎదిగినప్పుడు, విద్యా, వైద్య సేవలను సంపూర్ణంగా పొంది, పేదరికం నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మంత్రి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి స్థిరమైన అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ వేడుకలలో స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజా ప్రతినిధులు, న్యాయవ్యవస్థ ప్రముఖులు, పోలీసు అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం, వివిధ సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవా కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, పాత్రికేయులు, విద్యార్థులు ఉత్సాహంగా భాగస్వామ్యమయ్యారు.

ప్రశంసాపత్రాలను ప్రదానం చేసిన మంత్రి

రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి మంత్రి సర్టిఫికేట్లను అందజేశారు. వేడుకల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ జె.ఉదయభాస్కరరావు, భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు, అడిషనల్ ఎస్పీలు వి. భీమారావు, ఎటీవీ రవికుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాత్రికేయులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మీతో పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సాకారం చేస్తాం

(1వ పేజీ తరువాయి)

రూ. 3 వేల నుండి రూ.4 వేలకు పెంచామన్నారు. ఏటా రూ.408 కోట్లను పెంచిన పెన్షన్ రూపంలో అదనంగా చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయకక్షలు ప్రేరేపించకుండా గ్రామాలలో, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే విధంగా ప్రవర్తించాలని అందరికీ ముఖ్యమంత్రి సూచించారని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి పురుషోత్తం కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, న్యాయమూర్తులు బుల్లి కృష్ణ, ఎస్.కె.ఎండి . ఏ . పర్వీజ్, జిల్లా న్యాయసేవాధికార సమస్త కార్యదర్శి కె. రత్నప్రసాద్, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ , జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి, డిఆర్ఓ డి.పుష్పమణి, , ఆర్డీఓ ఎన్ .ఎస్. కె. ఖాజావలి, డి.ఆర్.డి. ఏ పీడీ విజయరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PARUVU RAVINDRA (New Name)**, S/o. Dharma Raju, Previously Called **PARUVU RAVEENDRA (Old Name)**, "Resident of D.No.4-90/2, Ramalayam street, Pedapeta, Marteru village, Penumantra Mandal, West Godavari District, A.P.-534122. I have changed my name from **PARUVU RAVEENDRA (Old Name)** to **PARUVU RAVINDRA (New Name)** for all practical purposes.

CHANGE OF NAME

I, Degala Vijay Kumar, S/o. Degala Eswara Rao, Resident Address : 6-16, Kothapeta, Near Ramalayam, Chinamram, Bhimavaram Mandal, W.G. Dist, AP-534204. I Have Changed My Name From **Degala Vijaya Kumar (Old Name)** to **Degala Vijay Kumar (New Name).** Hence After All My Documents And Correspondence Will Be Continue With My New Name **Degala Vijay Kumar.**

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

కామవరపుకోటలో : 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. కామవరపు కోటలోని తహసిల్దార్ కార్యాలయం,

శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల, ప్రభుత్వం మోడల్ డిగ్రీ కళాశాలలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ జాతీయ జెండాను ఎగరవేశారు. కొత్తూరు వర్కర్స్ యూనియన్, చౌతన సెంటర్ వద్ద సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎండిఓ జే.స్వర్ణభారతి, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అనూష భాగ్యరాజ్, కామవరపుకోట హైస్కూల్ వద్ద విద్యా కమిటీ చైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్, రామన్నపాలెం మండల ప్రాథమిక పాఠశాల వద్ద మాజీ ఎంపీపీ మద్ది పోటి నాగేశ్వరరావు, తడికలపూడి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కె.జయబాబు, ఆడమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గూడపాటి కేశవరావు, కామవరపుకోట మెయిన్ స్కూల్ వద్ద సొసైటీ మాజీ చైర్మన్ గంటా సత్యబాబు లు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

నర్సాపురంలో: పార్క్ రోడ్డు అధికారి వారి వీధి జనసేన యూత్ ఆధ్వర్యంలో 78 వ స్వాతంత్ర వేడుక ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసాపురం శాసన సభ్యులు జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రతి మనిషి దేశాభివృద్ధి

కోసం దేశ సంస్కృతి కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి కిరణ్, అధికారి సూరిబాబు. అధికారి మధుసూదన్ రావు,యాతం మహేష్, సమయ్, గుగ్గిలపు సూర్యనారాయణ, జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో : నర్సాపురంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అధికారులు, పార్టీ శ్రేణులు, నాయకులు, వివిధ సంఘాల వారు ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే నాయకర్ ముఖ్య అతిథిగా

పాల్గొని జాతీయ పతాకాలను ఎగురవేశారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద, సీతారాంపురం లేస్ ఆఫీస్ , సెవెంత్ డే స్కూల్ , సెంటెన్స్ స్కూల్, గవర్నమెంట్ హాస్పిటల్ ,ఎమ్మార్వో ఆఫీస్ ,ఎంపీడీవో ఆఫీస్,మొగల్తూరు ఎమ్మార్వో ఆఫీస్ మరియు వలందర్ రేవు లలితాంబ ఘాట్ దగ్గర దివ్యాంగులు వికలాంగులు ఏర్పాటు చేసిన పట్టణంలో పలు వార్డులలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు

పాలకొల్లులో: పాలకొల్లు పట్టణంలోని బంగారు వారి చెరువు గట్టు, 8వ వార్డులో, రావిచెట్టు వద్ద స్వతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా బిసి సెల్

అధ్యక్షులు కర్నేన గౌరు నాయుడు, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి తదితరులు జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి, జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు జివి, పెచ్చెట్టి బాబు, వార్డు అధ్యక్షులు వి.శేషు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారిగా మక్బూల్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : విధి నిర్వహణలో చేసిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మండలంలో

మంగపతి దేవి పేట గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న మక్బూల్‌కు జంగారెడ్డి గూడెం డివిజనల్ అధికారి అద్దయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. మక్బూల్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

కంటి వైద్యాధికారికి ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య అధికారిగా సేవలు అందిస్తున్న ఐ. శ్రీనివాస్‌కు

గురువారం భీమవరం కలెక్టర్ కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఉత్తమ ఆప్తాల్మిక్ అధికారిగా ఉత్తమ పురస్కారం లభించింది. రాష్ట్ర మంత్రి నిమ్మల రామా నాయుడు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ఆర్ సంతోష్ నాయుడు డాక్టర్ పి. కిరణ్మయి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె. విల్సన్ బాబు సిబ్బంది వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు.

జాతీయ పతాకం ఎగరవేసిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు

విశాలాంధ్ర- పాలకోడేరు : 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘు రామకృష్ణంరాజు మండల కేంద్రమైన పాలకోడేరులో వివిధ కార్యాల యాల వద్ద

గురు వారం జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడంలో ఎంతోమంది త్యాగమూర్తుల శ్రమ త్యాగఫలం, ప్రాణ త్యాగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పాలకోడేరు మండలానికి సంబంధించి మోగల్లు గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిని గడగడ లాడించాడని చివరకు దేశం కోసం చిరుప్రాయంలోనే తన ప్రాణాన్ని అర్పించాడని కొనియాడారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ఉండి జనసేన పార్టీ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, మండల తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం రాణికి ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో ఏఎన్ఎంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా నిమ్మగడ్డ ఎలిసరాణికి ప్రభుత్వం ప్రతిభా పురస్కారం లభించింది. 78వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో

భాగంగా ఏలూరు పేరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి చేతుల మీదుగా ముదినేపల్లి పీహెచ్సీ పరిధిలో ముదినేపల్లి సచివాలయం-2లో ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఎలిసరాణికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈమెను ముదినేపల్లి వైద్య సిబ్బంది అభినందించారు.

అమరవీరుల ఆశయాలు కొనసాగించాలి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు :ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన జెండా వందన కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, బాలగంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్‌లను స్మరించుకొని వారి ఆశయాలను కొనసాగించి నప్పుడే వారి పోరాట ఫలితం ఉంటుందని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉత్తమ ఉద్యోగస్తులు 31 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న వికలాంగురాలు మల్లేశ్వరికి ట్రై సైకిల్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్స్ సభ్యులు ఎస్ఎంఆర్. పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశీ శ్రీనివాసరావు, నూకపేయి సుధీర్ బాబు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో : దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని, దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని ఎమ్మెల్యే పులపర్తి

రామాంజనేయులు అన్నారు. భీమవరం కోస్టల్ సిటి సెంటర్ (మల్టీప్లెక్స్) ఆవరణలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించారని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాలు ఫలితంగా స్వతంత్రం సాధించామని అన్నారు. కార్యక్రమంలో కోస్టల్ సిటి సెంటర్ మేనేజర్లు శివరామరాజు, కృష్ణంరాజు, బాబీ, ముచ్చకర్ల శివ, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవడం ప్రతి పౌరుడు కర్తవ్యమని వైస్ ఎంపిపి అడ్డాల రాము అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాని ఆవిష్కరించారు.

జడ్పీహైస్కూల్‌లో :ఎందరో త్యాగమూర్తుల పోరాటాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించు కున్నామని, వారి త్యాగాలను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని విద్యాకమిటీ చైర్మన్ నూకల కనకదుర్గ తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు స్థానిక హైస్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ నాయకుల చిత్ర పటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో : ఎందరో త్యాగమూర్తుల పోరాటాలు ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నామని, వారి త్యాగాలను మనమం దరం ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి మండల అధ్య క్షులు కోడి నరసింహం అన్నారు. వీరవాసరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మండలంలో ఆయా గ్రామాల్లో : ఎందరో మహ నీయుల త్యాగఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యమని పలువురు ప్రముఖులు తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండ లంలోని ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరవాసరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామాంజనేయులు, వీరవాసరం, రాయకుదురు, తోలేరు, బాలేపల్లి పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు చికిలే మంగతాయారు, గెద్దం భారతి, వేండ్ర లీలాకృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాసరావు, రాయకుదురు జడ్పీ హైస్కూల్లో విద్యాకమిటీ చైర్మన్ శలా భవాని, గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నరసింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

భీమడోలులో : త్యాగ ధనుల ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు . 78 వ స్వాతంత్ర్య వేడుకలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ

సందర్భంగా ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. అయన మాట్లాడుతూ బ్రిటిష్ దొరలనుండి మహనీయులు విముక్తి కలిగించి , దేశ ప్రజలకి స్వేచ్ఛయుత జీవితం ప్రసాదించారని కొనియాడారు. భీమడోలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసారు. వారిసేవలని ప్రశంసిం చారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రమాదేవి, స్థానిక జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగపాలెంలో: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో వాడవాడలా పతాకావిష్కరణ చేశారు. మండల పరిషత్ కార్యాల యంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ముసు నూరు వెంకటలక్ష్మి, తహశీ ల్దార్ కార్యాలయంలో తహశీల్దార్

నజీమ్ ఉల్లాషా, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషనులో ఎస్ఐ చెన్నారావు పతాకావిష్కరణ చేశారు. పాఠశాలల్లో, పంచాయతీ కార్యాలయాలలో, ప్రాథమిక ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలలో, దళితవాడలలో పతాకావిష్కర ణలు చేశారు. ప్రతి గ్రామంలో విద్యార్థులు జాతీయ జెండాతో ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

నూజివీడులో: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఆర్డీవో భవాని శంకరి స్వాతంత్ర సమరయోధులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు గౌరవ వందన స్వీకరించారు. నూజివీడు పోలీస్ స్టేషన్లో సీఐ రామకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వప్రైవేటు కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

మండలంలోని గ్రామాల్లో సచివాల యాల వద్ద సర్పంచులు జాతీయ జెండాలు ఎగుర వేశారు. నూజివీడు పట్టణంలోని పలు కూడళ్లలో నూజివీడు మున్సిపల్ చైర్పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ట్రిబుల్ ఐటీలో : నూజివీడు ట్రిబుల్ ఐటీలో ఘనంగా నిర్వహించారు.ముందుగా జాతీయ జెండాను డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ ఎగురవేశారు. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సంద ర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ప్రజలు చేసిన కృషిని నేడు మనం ఆస్వాది స్తున్నాం అన్నారు.

మనమందరం దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అప్పగిం చిన విధులకు లేదా మనం చేయాలనుకుంటున్న విధులను పునరంకితం కావాల న్నారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సింగ్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది ఆర్జీయూకేటీ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ ఎన్.రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్, టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చల్లన్న దొర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిన్నారులతో దేశభక్తి గీతాలు పాడించి అనంతరం తహసీల్దార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యంపై అనేక పోరాటాలు చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చారని కొనియాడారు. జెడ్పీటీసీ దాసరి శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితమే నేడు

మన భారతదేశానికి స్వాతంత్ర్యం రావ డం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట వీర వెంకట సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో : పెదపాడు హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వద్దాది నాగ సుబ్రహ్మణ్యం ఎగురవేశారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు పి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల విద్యా కమిటీ చైర్మన్

నాగ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సుమారు 30 వేల రూపాయలు ఖర్చుతో పాఠశాల తరగతి గదులలో ఫ్యాన్లు , ఇతర సౌకర్యాలు కల్పించిన పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు యు వి.సత్యనారాయణను గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సన్మానించారు.

మహనీయుల త్యాగఫలం స్వాతంత్ర్యం

విశాలాంధ్ర-ఏలూరు: ఎందరో ప్రాణ త్యాగాలు, వేలాదిమంది జైలు జీవితాలు, లక్షలాదిమంది అరెస్టులు ఆందోళనలతో సాధించుకున్న భారత దేశ స్వతంత్రాన్ని నేటి పాలకులు అవహేళన చేస్తున్నారని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఏలూరు ఆర్ఆర్ పేట ఎన్టీఆర్ పార్క్ వద్ద భారత దేశ 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించగా ఏఐటియుసి పతాకాన్ని యూనియన్ వ్యవస్థాపకులు మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమేష్ కుమార్ ఆవిష్కరించారు. గాంధీజీ చిత్రపటానికి యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు నూలు పోగు దండ వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చిత్రపటానికి యూనియన్ నాయకులు బి. పెద్దిరాజు నులుపోగు దండేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. అప్పలరాజు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పివి రమణ, ఎస్. శ్రీనివాస్, డి. వెంకటేశ్వరరావు, కే రామకృష్ణ, లోమీ, సిహెచ్ హరినాథ్ బాబు, డి. దుర్గాప్రసాద్, కందుల శ్రీను, వెంకటేష్, రమేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం సీపీఐ కార్యాలయం వద్ద : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక మృత్యుంజయ నగర్ గ్రంథాలయం వద్ద జాతీయ జండా ను మండల కార్యదర్శి

నెక్కంటి క్రాంతి కుమార్ ఆవిష్కరించారు ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో ఎందరో ప్రాణాలు అర్పించి స్వరాజ్యం సాధించారని తెలిపారు. ఇప్పటికీ పేదరికం పోలేదని నేటికీ కార్మికుల హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయ రావు, సానబోయిన ఫణిరాజు, నాగళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయంలో : జంగారెడ్డి గూడెం మండల సిపిఐ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.తొలుత పార్టీ కార్యాలయం ఎదుట త్రివర్ణ పతాకాన్ని సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన

వెంకటరమణ రాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్య వాదుల కబంధ హస్తాల నుంచి భారతదేశ విముక్తి కొరకు కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘనమైన చరిత్ర పార్టీకి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, బొక్కా శ్రీనివాస్, కొత్తూరు నాగేశ్వరరావు, ముప్పిడి శ్రీను, ఎడ్లపల్లి ప్రసాద్, జాలా వెంకటేశ్వరరావు, చిలంత రాజుల శ్రీనివాస్, తాళ్లూరి నాగరాజు, హనుమంతు, కొత్తూరి నాగేశ్వరరావు, కలపాల చంటియ్య ,పొడదోలు రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐఏలూరు ఏరియా 16వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో : కార్పొరేట్ అనుకూల విధానాలపై మరో స్వాతంత్ర పోరాటం చేయాలని సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు కొల్లూరు సుధారాణి పిలుపునిచ్చారు.

సిపిఐ ఏలూరు ఏరియా 16వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కొల్లూరి సుధారాణి జాతీయ పతాకాన్ని ఎగరవేయగా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.కొల్లూరు సుధారాణి మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ల పరం చేస్తూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాడ ల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరి రవి, జిజ్జువరపు సురేంద్ర, లక్ష్మి, భవాని, నిస్సీ, ఎ.రవి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో :స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ అందలా విధానాలు ఉండాలని ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ (ఏఐటియుసి) డిమాండ్

చేసింది.ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) అనుబంధ ది ఏలూరు కార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అధ్యక్షులు ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన జరిగాయి. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి ఒకరికొకరు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పతాక ఆవిష్కరణ చేసిన యూనియన్ మాజీ కోశాధికారి చిట్యాల పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళయినా ఇంకా దేశంలో అసమానతలు అలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఆటోమొబైల్ షెడ్లు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్న ఎందరో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని ప్రభుత్వం గుర్తించి తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మహబూబ్ షరీఫ్, కార్యదర్శి బొండాడ హరినారాయణమూర్తి, సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి వెంకటపతి, కోశాధికారి కాటూరి శ్రీధర్, కమిటీ సభ్యులు గ్రంధి నాగ రవి కిషోర్ చెంబోలు రాము, కువ్వవరపు ప్రియ, పాలకొండ శ్యాం ప్రసాద్, అబ్దుల్ లుక్మన్, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో :77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను కామవరపుకోట శివారు కొత్తూరు కార్యాలయం

వద్ద ఏఐటియుసి, సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు ఈదర ఆంజనేయరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు మాట్లాడుతూ వ్యాపారం పేరుతో భారతదేశంలో అడుగుపెట్టి సిరిసంపదలన్నీ దోచు కుంటూ దాచుకుంటూ భారతీయులను కట్టు బానిసల్లా చూస్తున్న తరుణంలో అల్లూరి సీతారామరాజు, సర్దార్ భగత్ సింగ్ లాంటి పోరాట యోధులు ఆస్తులను, త్యాగం చేసి దేశానికి స్వాతంత్రం సాధించారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లు గా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న పరిశ్రమలను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న నరేంద్ర మోడీ ప్రైవేటీకరణ విధానాలను కార్మిక శక్తులు ఐక్యమై కార్మిక హక్కులను కాపాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, ముఠావర్కర్ సీనియర్ అధ్యక్షుడు కోటిగంటి సోమరాజు, నల్లమూతుల కృష్ణ, జల్లి దుర్గారావు, అమృతలూరు సాగరాజు, ఏలూరు ప్రసాదరాజు, ఎన్నా భీమయ్య ,తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో : మండల వ్యాప్తంగా 78వ స్వంత్రత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.కుక్కునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మీటర్ల జెండాతో వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించి దేశ భక్తి చాటారు.విద్యార్థులు నృత్యాలు చేస్తూ అలరించారు.

వాడవాడలా జాతీయ పండుగను ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,పలు పార్టీల ప్రజానిధులు ,సంఘాల నాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికలో సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : సీపీఐ కార్యాలయం కపర్ది భవనంలో సీపీఐ నాయకులు జాతీయ జెండాను ఎగరవేశారు. పట్టణ కార్యదర్శి మండలనాగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు

అయ్యిందన్నారు. ఆనాడు భగత్ సింగ్ ,రాజగురు సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు ,చంద్ర శేఖర్ ఆజాద్ ఎంతో మంది మహనీయులు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని ప్రాణ త్యాగాలు చేశారని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని,ఉపాధి లేదు అని , రైతులు ఆత్మ హత్యలు పెరిగాయని అన్నారు. కార్పొరేట్ శక్తులు వేల కోట్లు బ్యాంకు ఋణం తీసుకుని విదేశాలకు వెళ్లిపోతుంటే వారికి కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో దాస్యం రాము, అల్లం రాము , వద్దది మేరి, దీపేతి వెంకటరావు, అల్లం నరేంద్ర , బొమ్మిడి కృష్ణ, రావూరి బాబీ , చింతాడి బాలు పాల్గొన్నారు.

టి నరసాపురంలో : మండలంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ యూనియన్

కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు మల్లెల సత్యనారా యణ, టి నరసాపురం ఎర్ర చెరువు కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు తాడిగడప జయరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం, పంచాయితీ కార్యాల యాల్లో, జడ్పీ హైస్కూల్ బండివారిగూడెం, తిరుమలదేవిపేటలో ఎంపియుపి పాఠశాల ఎంపిపి, ఎస్ఎంసి చైర్మన్లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తిరుమల దేవిపేటలో పాఠశాల స్థల దాతను టిడిపి నాయకులు తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయా పాఠశాలలో ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తణుకులో :78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం తణుకులో వంక సత్యనారాయణ సురాజ్య భవన్లో జాతీయ పతాకాన్ని సీపీఐ తణుకు పట్టణ

కార్యదర్శి బొద్దాని నాగరాజు ఆవిష్కరించారు .ఈ సంద ర్భంగా బొద్దాని నాగరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరు ప్రతిజ్ఞ పూనాలని పిలుపు నిచ్చారు.స్వాతంత్ర్యం కొరకు పోరాడిన అమరవీరులు నాయకుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బండి సత్యనారాయణ,బొద్దాని మురళీ కృష్ణ, పి.దత్తాత్రేయ ప్రసాద్ ,దేగల హనుమంతరావు,పుట్టా అమ్మిరాజు,నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరించిన డిపిఆర్ఓ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు లోని జిల్లా సమాచార పౌర సంబంధాధికారి కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పౌర సంబంధాధికారి ఆర్. వి. ఎస్. రామచంద్రరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.కార్యాలయ సిబ్బంది జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో డివిజనల్ పి ఆర్ ఓ సిహెచ్. దుర్గాప్రసాద్, సహాయక సమాచార ఇంజినీరు కె. ధనుంజయరాజు, కార్యాలయ సిబ్బంది డి.శౌరిప్రసాద్, టి. బాబురావు, పి.సాగర్, ఆర్. మల్లిబాబు, ప్రసాదు, శారద, రత్నం, రేష్మ, రామారావు, ప్రభృతులు పాల్గొన్నారు.

భీమా రావుకు బెస్ట్ అవార్డు ప్రధానం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో సమగ్ర శిక్షలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ ,గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డా ఎమ్ఏకె భీమారావుకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ బెస్ట్ సర్వీస్ అవార్డు అందచేశారు, ఈ అవార్డు రావడానికి సిఫార్స్ చేసిన డిప్యూటీ కలెక్టర్, ఎపిసి మధుసూదనరావు, డిఇఓ కమల కుమారి భీమారావ్ సేవలను గుర్తించి సిఫార్స్ చేశారు. ఈ సందర్భంగా విద్యా శాఖకు చెందిన అధికారులు, ఉపాధ్యాయుల, నాయకులు, సామాజిక వేత్తలు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేసారు.

అన్యం రాంబాబుకు ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర - అమలాపురం : పంచాయతీ రాజ్ (ప్రాజెక్ట్) డిఈఈ అన్యం రాంబాబుకు జిల్లా స్థాయిలో ఏఐఐబి, పిఎం జిఎస్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి ఉడిముడి బ్రిడ్జి, నల్లవంతెన బైపాస్ రోడ్డు, సమనస సీసీ రోడ్డు, బోడసకుర్రు ఏటిగట్టు రోడ్డు మొదలైన తలమాణికమైన పనులు చేసినందుకు సేవలు గుర్తించి 78వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంసా పత్రం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, ఎస్ ఈకె చంటిబాబు అభినందించారు. పంచాయతీ రాజ్ డిఈఈ రాంబాబుకు ఉత్తమ సేవా పురస్కారం లభించటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు గుర్తించాలి

సీఐ విద్యాసాగర్

విశాలాంధ్ర - రావులపాలెం : దేశం కోసం నిరంతరం పోరాటం సాగించిన స్వతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆలమూరు మండలం చెముడులంక శ్రీ షిరిడి సాయి విద్యాసంస్థలో గురువారం జరిగిన స్వతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న ఈ స్వతంత్రం ఎంతోమంది త్యాగాల ఫలితం అన్నారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు దేశభక్తికి సంబంధించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆ విద్యాసంస్థల ఎన్‌సిసి విద్యార్థులు సుభాష్, ఠాగూర్, అశోక్, రామన్ గ్రూపుల మార్చ్ ఫాస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించి ఆ విద్యార్థులను సీఐ విద్యాసాగర్ అభినందించారు.

ప్రశంస పత్రం అందజేత

విశాలాంధ్ర- దేవరపల్లి : దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన మండల మానవతా సంస్థ చైర్మన్, రాష్ట్ర మానవతా సంస్థ కన్వీనర్ బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులకు 2023 – 2024 సంవత్సరంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రశంసా పత్రం అందజేసింది. గురువారం రాజమండ్రి ఆర్ట్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర సంస్కృతిక సినిమా ఆటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి చేతులమీదుగా ప్రశంస పత్రాన్ని బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు అందుకొన్నారు. ఈ సందర్భంగా బలుసుసత్యనారాయణ మాట్లాడుతూ 2021- 22 సంవత్సరంలో దేవరపల్లి మండల మానవతా సంస్థ చైర్మన్‌గా ఎన్నికై రూ.50 లక్షలతో వివిధ సేవా కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు .

విశాఖలో సెప్టెంబర్ 3న బహిరంగ సభ

- ఏఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాల పోస్టల్ ఆవిష్కరణ
- జయప్రదం చేయాలని పిలుపు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం ఉదయం సామర్లకోట పట్టణ ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డ సత్యనారాయణ అధ్యర్యంలో విశాఖలో సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా బ్రిటీష్ కాలం నుండి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చడం, శాశ్వత ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేయడం, సమ్మె చేసే హక్కు లేకుండా చేయడం, అన్ని కాంట్రాక్టు ఉద్యోగులను నియమించడం కేంద్ర ప్రభుత్వం బిజెపి అధికారంలో వచ్చిన నాటి నుండి నేటి వరకు జరుగుతున్నాయని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ లను అమలు చేసి, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి నాయకత్వం వహిస్తూ 1250 రోజులుగా నిరసన ఉద్యమంలో గుర్తింపు సంఘంగా ముందుం దని, ఇంతటి ఘన చరిత్ర గల భారతీయ ప్రప్రథమ కార్మిక సంఘం జాతీయ ఏఐటీయూసీ సమ్మేళనాలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో విశాఖలో జరుగుతున్నాయని, ఈ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని, ఈ బహిరంగ సభకు ఏఐటియుసి అనుబంధ సంఘసభ్యులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, కార్యదర్శి, పెద్దిరెడ్ల అర్జున్ రావు, సప్ప సూరిబాబు, నమ్మి సత్యనారాయణ, బల్లా లక్ష్మీనారాయణ, మడగల రమణ, వెలిశెట్టి రామదాసు, అడప చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర - అనపర్తి : ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం అని కానీ ఈ రోజున కుల,మత, ప్రాంతాల మధ్య, భాషా బేధాలు అలుముకుని భారతదేశాన్ని ముక్కలుగా చేయడానికి అనేక శక్తులు ప్రయత్నం చేస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని నియోజకవర్గంలో గ్రామ గ్రామాన జాతీయ జెండా రెపరెపలాడింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక పంచాయతీ కార్యాలయం, ఏరియా ఆసుపత్రి, ఎమ్మెల్యే కార్యాలయం, వెంకటరత్నాపురం, రామవరం నల్లమిల్లి మూలారెడ్డి హై స్కూల్, పంచాయతీ ఆవరణలో ఇంకా పలు చోట్ల జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, ఎన్‌డిఏ నేతలు, కార్యకర్తలు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, కర్రి చిన వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి టాలెంట్ పరీక్షల్లో అంజలికి ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - పెదపూడి : గోదావరి టాలెంట్ 2023-24 పరీక్షల్లో కొప్పవరం గ్రామానికి చెందిన సత్తి బ్రహ్మారెడ్డి చిన్న కుమార్తె సత్తి అంజలి కృష్ణాజిల్లా స్థాయిలో ద్వితీయ స్థాయి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని స్కూల్లో గురువారం అంజలికి షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజలిని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, కొప్పవరం రెడ్డి సంఘం అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కొవ్వూరి దుర్గ, గోపాల రామారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయండి

విద్యార్థులతో కమిషనర్ భావన

విశాలాంధ్ర - కాకినాడ : కష్టపడి చదువుకుని సమాజావృద్ధి, మీ తల్లిదండ్రుల అభివృద్ధితో పాటు మీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఈఈ మాధవి ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి కమిషనర్ భావన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా అడుగులు వేయాలని, ఇష్టమొచ్చిన రంగాన్ని ఎంచుకుని బాగా చదివి అత్యుత్తమ శిఖరాలను అధిరోహించాలన్నారు. పలువురు విద్యార్థులు కమిషనర్‌కు స్వాతంత్ర్యదినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు, ద్వాక్రాసం ఘాల యాని మేటర్లు ఇలా పలువురు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో స్కేటింగ్ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యకుమారి, కార్యదర్శిఏసుబాబు, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఈఈ మాధవి పాల్గొన్నారు.

దొక్కా సీతమ్మ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రుల అన్నపూర్ణ దొక్కా సీతమ్మ జీవితచరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో చెయ్యేరు గ్రామస్తులు తుపపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో జనసేన నాయకులు చెయ్యేరు హైస్కూల్లో దొక్కా సీతమ్మ జీవిత చరిత్ర, ఆంధ్రజాతి ఆత్మ గౌరవ ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర, స్వతంత్ర సమరయోధులు గురించి వ్యాసరచన పోటీ నిర్వహించారు. తుపవట పల్లి నాగభూషణం ఆధ్వర్యంలో భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేస్తామని జనసేన మండల ఉపాధ్యక్షుడు బలరాం తెలియజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం ప్యాకెట్లు అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : వర్గాలకు సమానంగా అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవు తుందని కొత్తపేట టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. ఆలమూరు తెలుగుదేశం కార్యాలయం వద్ద గురువారం స్వాతంత్ర ఫలాలు అన్ని నిర్వహిం చిన స్వాతంత్ర దినోత్సవ వేడు కల్లో ఆయన పాల్గొని పతాకావిష్కరణ చేశారు. అమలాపురం తెదేపా రైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన 26 కిలోల బియ్యం ప్యాకెట్లను పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంజీవ్ అందజేశారు.

గుండెపోటుతో సీపీఎం నేత మృతి..

విశాలాంధ్ర - పెరవలి : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం పిట్ల వేమవరం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు నేలపూడి రాజారత్నం కుమారుడు స్టాలిన్ గుండెపోటుతో మరణించారు. గురువారం సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, స్టాలిన్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయనకు ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. స్టాలిన్ సుదీర్ఘకాలం పార్టీ సభ్యుడిగా శాఖ కార్యదర్శిగా పనిచేశారని రాంబాబు తెలిపారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి సంతాపాన్ని తెలియచేశారు శాఖ కార్యదర్శి గుమ్మాపు డేనియల్ నివాళులు అర్పించారు.

జీ తెలుగులో మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి', ప్రేమలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : శ్రావణమాసం ప్రత్యేకంగా ఆదోని వేదికగా నిర్వహించిన జీ తెలుగు మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి'ని ఆగస్ట్ 18వ తేది మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం చేయనుందనీ సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. సరికొత్త సినిమాలతో అలరించే జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమా ప్రేమలుని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందించేందుకు సిద్ధమైందన్నారు. నస్లెన్ కె గఫూర్, మమిత బైజు నటించిన ప్రేమలు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ఆగస్టు 18 సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. జీ తెలుగు ఇటీవల ఆదోనిలో ప్రముఖ నటీనటులతో శ్రావణమాసం ప్రత్యేక కార్యక్రమం 'శ్రావణలక్ష్మి' మెగా ఈవెంట్ను నిర్వహించి వీక్షకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందించిందన్నారు. జీ తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న జాబిల్లికోసం ఆకాశమల్లే, మా అన్నయ్య సీరియల్స్ నటీనటులు ఈ వేదికపై అభిమానులతో సంభాషించి వారి సంతోషంలో పాలుపంచు కున్నారన్నారు.

ఆంద్రు అనిల్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ జన్మదిన వేడుకలు గౌరీపట్నంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవరపల్లి మండలం తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, నాయకులు ఆంద్రుఅనిల్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు . ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు నేతలకు కార్య కర్తలకు అభిమానులకు అనిల్ కేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గన్నమని హరికృష్ణ , ఉప్పులూరి రామారావు యాగంటి వెంకటేశ్వంరావు, ముళ్ళపూడి దొరాజి చౌదరి, పెనుమత్స సుబ్బ రాజు, బాదంపూడి ఇందిరా, ఎం రాజేశ్వరి, గద్దె శ్రీనివాస్, మెంతిమి అమరా వతి, సురేష్ నూతంగి దొరబాబు, పాతూరి గిరిధర్, కొట్టూరు ధ్రువకాంత్ , ఆంద్రు అఖిల్, దాపర్తి వీర కృష్ణ శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం, శ్రీనివాస్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులకు ఆంద్రు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు

డ్రైవర్పై అసోసియేషన్ అధ్యక్షుడు దాడి

విశాలాంధ్ర - యానాం : యానాం రెసిడెన్షియల్ టాక్సీ ఓనర్స్ కమ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ సిలేమాన్ డ్రైవర్ రమేష్ పై దాడి చేయడం సమంజసం కాదని సీఐటీయూ కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్లో డ్రైవర్గా ఉన్న రమేష్కి అధ్యక్షుడు సిలేమాన్కి మధ్య నెలవారి సభ్యత్వం ఫీజుకు సంబంధించి వివాదం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో డ్రైవర్ రమేష్ పై అధ్యక్షుడు సిలే మాన్ దౌర్జన్యంగా దాడి చేశారని సత్యనారాయణ తెలిపారు. ఈ సంఘటనలో దెబ్బలు తిన్న రమేష్ను ఆస్పత్రికి తరలించి, ఎమ్మెల్సీ నమోదు చేశారు. తోటి డ్రైవర్లు ఆసుపత్రికి వెళ్లి రమేష్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని సంఘీభావం తెలిపారు. ఏదైనా ఉంటే మాట్లా డుకుని తేల్చుకోవాలే తప్ప దాడి చేయి చేసుకోవడం అనేది సమంజసం కాదని సంఘ సభ్యులు సిలేమాన్ తీరుపై మండిపడ్డారు.

ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

విశాలాంధ్ర - కొవ్వూరు : భిన్నత్వంలో ఏకత్వమే రక్షణగా దశబ్దాల తరబడి సాగిన స్వాతంత్ర్యో ద్యమ పోరాటంలో ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే మనకు దక్కిన స్వాతంత్ర్యమని కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్న కుమారి అన్నారు. కొవ్వూరు పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు, స్వాతంత్ర ఉద్యమంలో అమరులైన వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడంలో అందరూ భాగస్వాములు కావాలని ఐక్యతతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డానియల్, కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి కంటమనే రామకృష్ణ కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాయన రామకృష్ణ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి పొట్రు శ్రీనివాసరావు, ఒకటో వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

యానాంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - యానాం : కేంద్రపాలిత యానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యానాం బాలయోగి క్రీడా ప్రాంగణం లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వర్యులు లక్ష్మీనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు కవాతును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం ప్రాంతీయపరిపాలన అధికారి మ్యూనిస్వామి, యానాం శాసన సభ్యులు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ శాఖలకు సంబంధించిన కవాతులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులచే మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం మరియు పరిసర ప్రాంతాల నుండి ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో పిల్లల తల్లిదండ్రులు, ప్రాంతీయవాసులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర - కాట్రేనికోన : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాట్రేనికోనలో శ్రీవాణీ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు, సుమేథా హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (10o2) లలో నిర్వహించిన వ్యాసరచన, వక్రుత్వ పోటీ, చిత్రలేఖనం, ఏకాపాత్రాభినయం పోటీలకు పిల్లలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కాట్రేనికోనలో ఉన్న మూడు హైస్కూల్స్కి ఉత్తమ సేవాపురస్కారం 2024 అవార్డు ప్రధానోపాధ్యాయులు ఎమ్ వేంకటేశ్వరరావు, తాత పూడి సుబ్బారావు, తాత పూడి బాల సుబ్ర హ్మణ్యంలకు ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకులు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి మొమెంటో, ప్రశంసా పత్రము, దుశ్శాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాత పూడి లక్ష్మీ నారాయణమూర్తి, ఆకొండి ఉమా మహేష్ శర్మ, ఆణివిళ్ళ సూర్య కామేశ్వర రావు, పెద్దింటి వ్యాస మూర్తి, గ్రంధి నానాజీ, కముజు సర్వేష్ పాల్గొన్నారు.

సురేష్కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర - కరప : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న టేకుమూడి సురేష్కు ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక కావడంతో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గ్రామీణ శాఖ మాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సురేష్ ఉత్తమ అవార్డు అందుకొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితర ఉద్యోగులు సురేష్కు అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్ 1989-90 ఎస్ఎస్సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం పాఠశాలలో జరిగింది. సేవా మిత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం జరిగింది. స్వాతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని ఎంపీ పోషన్-శుభతిధి భోజనం కార్యక్రమం నిర్వహించారు. 600 మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. విశ్రాంతి ఉపాధ్యాయులు కొప్పిశెట్టి ఆనందరావు, రాజు, కెవిఆర్లను సన్మానించారు. దాకమూరి నాగమనేశ్వరరావు, ఏడిద శ్రీను, జవ్వాది దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్కు సేవా పురస్కారం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలుకు చెందిన ప్రముఖ సామాజికవేత్త ముదునూరి లతేంద్ర వర్మకు ప్రభుత్వం నుండి ప్రశంసాపత్రం లభించింది. ఈ మేరకు ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆయన సమాజానికి చేస్తున్న సేవలను అభినందిస్తూ గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా అమలాపురంలో జరిగిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ ఆయనకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. లతేంద్ర వర్మను పలువురు అభినందించారు.

కొవ్వూరు ప్రభుత్వ హైస్కూల్లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు ప్రభుత్వ హైస్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విద్యా కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థుల నుంచి విశాలాంధ్ర రాజమహేంద్రవరం బ్యూరో బలరాం పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విద్యాకమిటీ చైర్మన్, విద్యా కమిటీసభ్యులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారిగా ఈఓపిఆర్డికి ప్రశంసా పత్రం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: పంచాయతీ విస్తరణాధికారి గా రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ ఉద్యోగి గా ప్రశంసా పత్రం పొందిన ఈ ఓ పి ఆర్ డి జె డి వి ప్రసాద్ ను ఎంపీడీవో జివిఎస్ ఆర్కే రాజు, తహసీల్దార్ పి ఎన్ డి ప్రసాద్, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, అభినందించారు.

ఒరిజినల్ దస్తవేజు పోయినది

తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జరం గ్రామ పరిధిలోగల భూమికి చెందిన **శ్రీమతి వత్సవాయి సత్యవతి భర్త (లేటు) కేశవ కుమార్ వెంకటపతి రాజు** చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం:**794/1972** తీసుకుని అజ్జరం గ్రామం నుండి పెరవలి సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయుగలరు.

కోలా వెంకటేశ్వరరావు
ప్లాట్ నెం-A9, సాయి మధు ఆర్కేడ్
టెలికం నగర్, సత్రంపాడు
Near-విద్యా వికాస్ స్కూల్, ఏలూరు
ఏలూరు జిల్లా
ఫోన్ నెం:-9618292999

అమరవీరులను స్మరించుకోవాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాజమహేంద్ర వరం నగరపాలక సంస్థ కార్యాల ఆవరణలో మున్సి పల్ కమిషనర్ కేతన్ గర్గ్‌తో కలిసి రాజమండ్రి శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం జాతీ య జెండాను ఆవిష్కరించారు. అనంతరం శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఈరోజు మనం ఎంతో సంతోషంగా ఆనందంగా నిర్వహించు కుంటున్న వేడుకలకు కారణమైన అమరవీరులను మనం స్మరించుకోవాలన్నారు. ఆనాడు ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు తమ రక్తాన్ని ధారపోసి ప్రాణ త్యాగాలు కూడా చేసి మనకు సంపాదించి పెట్టిన ఈ స్వాతంత్రం ఫలాల వాళ్ళనే మనము స్వేచ్ఛ జీవులుగా జీవించ గలుగుతున్నందుకు మనం ఎంతో అదృష్టవంతులమన్నారు. మున్సిపల్ కమిష నర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఒక పండగ వాతావరణం లో నిర్వహిం చుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను మనం ఎన్నటికీ మరవకూడదని వారిని ఎల్లప్పుడూ మదిలో స్మరించుకుంటూ కృతజ్ఞతా భావంతో మెలగాలని ఆయన అన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి సిబ్బంది అందరూ తమ కర్త వ్యాన్ని ఎంతో అంకితభావంతో పనిచేసి మంచి నడ వడిక కలిగి ఉండాలని ఆయన అన్నారు . మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ , రాజమండ్రి శాసనసభ్యులు శ్రీనివాస్ కలిసి శానిటేషన్ సిబ్బందికి యూనిఫారాలు అందజేశారు. వృత్తిపట్ల ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు.

స్వాతంత్ర వేడుకలలో మున్సిపల్ అదనపు కమిషనర్ పిఎం సత్యవేణి మున్సిపల్ సిబ్బంది కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధిద్దాం

విశాలాంధ్ర - రాజోలు : చేయి చేయి కలుపుదాం మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధిద్దాం అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్య క్షుడు కెవివి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మూఢ నమ్మ కాల నిరోధక చట్టం సాధన కోసం గురువారం జెవివి, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు మాట్లాడుతూ మూఢ నమ్మ కాలు మీద అవగాహన పాఠశాల స్థాయినుంచే జరగాలి. దిష్టి తీయడం అనేది మూఢనమ్మకం, మూఢనమ్మకాలు వ్యవస్థను నాశనం చేస్తున్నాయి. ఒక వర్గం స్వప్రయోజనం కోసం వీటిని పోషిస్తున్నారు. సైన్సు దాని విని యోగం పెరిగే కొద్దీ మూఢనమ్మకాలు కొనసాగుతూనే వున్నాయి. మూఢ నమ్మకాలు విద్యతోనే సమసిపోతాయి అని వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతరం చేయి చేయి కలుపుదాం మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధిద్దాం "అనే గోడపత్రికలను ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల అధ్యా పకుడు డా రమేష్, జిల్లా కార్యదర్శి వివేకానంద ప్రసాద్, రిటైర్డ్ నేవీ ఉద్యోగి విజయరావు, పూర్వ రోటరీ గవర్నర్స్ శివ, మురళీ, ఏబీవీపి గణేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌హాల్‌లో స్కాలర్‌షిప్‌లు పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : 78వ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా స్థానిక టౌన్‌హాల్ కమిటీ ఆధ్వ ర్యం లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కమిటీ అధ్యక్షులు జి సత్యనారా యణమూర్తి(నానాజీ), కార్యదర్శి పాబోలు చిన వున్నయ్య కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి సభ్యుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం టౌన్‌హాల్‌లో పనిచేస్తున్న సిబ్బంది తాలుకు 30 మంది విద్యా ర్థినీ, విద్యార్థులకు సుమారు 65వేల రూపాయిలను స్కాలర్ షిప్ రూపంలో నగదు మరియు నోట్ బుక్స్‌లను అందచేసారు. ఈ సందర్భంగా కార్య దర్శి పాబోలు చిన వున్నయ్య మాట్లాడుతూ గాంధీ నడయాడిన ప్రాంతం ఈ టౌన్‌హాల్ స్థలమని అంతటి పవిత్రమైన లిటరరీ అసోషియేషన్ ఏర్పాటు చేసారని గుర్తుచేసారు. స్వాతంత్రయం సిద్ధించిన సందర్భంగా విద్యాభివృకి ప్రోత్సాహం అందించాన్నదే తమ కమిటీ ప్రధానాశయ మన్నారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి భక్త్యాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జివై రఘునాథ్, కోశాధికారి ఎం సూర్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు సుసర్ల సుబ్రహ్మణ్యం, బచ్చు శివప్రసాద్, ఎం సత్యనారాయణ, నెక్కంటి శ్రీనివాస్, పి రామచంద్రరాజు, పెద్దిరెడ్డి సతీష్, బసవా ప్రసాద్, బచ్చు శేఖర్‌తోపాటు వెత్సా ఆనంద్, దంగేటి ప్రసాద్, సత్తి రవిరెడ్డి, వైఎస్ఎన్ చోడిశెట్టి పద్దరాజు, పైడా వెంకట నారాయణ, భమిడిపాటి శ్రీకృష్ణ, అద్దేపల్లి గంగరాజు, సమయమంతుల కృష్ణమోహన్, సభ్యులు పాల్గొన్నారు.

పిడబ్బుడి మినిస్టర్ లక్ష్మీనారాయణతో సమావేశం

విశాలాంధ్ర - యానాం : యానాంలో స్వాతంత్ర్య దినో త్సవ వేడుకల్లో జెండా ఆవిష్క రించడానికి విచ్చేసిన పుదు చ్చేరి పిడబ్బుడి మంత్రివ ర్యులు లక్ష్మీనారాయణ సమ క్షంలో యర్రగార్డెన్స్‌లో పుదు చ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మీటింగ్ ఏర్పాటు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే వారి ఏకౌంట్లోకి నష్ట పరిహారం జమవుతుందని 173 మంది ఆగిపోయిన వారికి మొత్తం అన్ని నెలల డబ్బులను ఒకేసారి వారి అకౌంట్లో పడతాయని, యానాంకి ప్రధాన సమస్య అయిన ఫ్లడ్ వాల్ కూడా అతి త్వరలోనే పూర్తి చేస్తామని పీడ బ్ల్యుడి, ఉద్యోగులు సమస్యలు కూడా అతి త్వరలోనే తీరిపోతాయని నేను మరల యానాం వచ్చేసరికి మీరు నా ముందు పెట్టిన సమస్యలు అన్ని తీర్చేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిపాలన అధికారితోపాటు పలు వురు అధికారులు, పుర్రప్రజలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దాసరికి రాష్ట్రపతి అవార్డు హర్షనీయం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన దాసరి దండు గంగరాజు (బుజ్జి) 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కల్లో. రాష్ట్రపతి చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం పట్ల గ్రామం అంతా సంతోషంతో సంబరాలు జరుపు కున్నారు. తమ గ్రామ ముద్దుబిడ్డ దేశ రాజ ధాని ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదు గా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని అంటు న్నారు. తమ గ్రామం నుండి రాష్ట్రపతి అవార్డు అందుకున్న దాసరి రెండవ వాడని అంతకు ముందు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోట కూర సాయి రామకృష్ణ మొదటివాడని గ్రామ నాయకులు, పెద్దలు సంతోషం వ్యక్తం చేసారు. 1998 బ్యాచ్ లో పోలీసు శాఖలో చేరిన గంగరాజు అంకిత భావం తో పనిచేస్తూ ఏ పదవిలో ఉన్నా పదవికి వన్నె తెచ్చారు. ఉన్నత అధికారుల నాయకుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మండల టిడిపి అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, దాసరి సోదరులు సాయిరాం, చిట్టిబాబు, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, శ్రీ కేదారేశ్వర ఉత్సవకమిటీ సభ్యులు నరాలశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

దుర్గాప్రసాద్‌కు స్వాతంత్ర దినోత్సవ పురస్కారం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని పల్లంకుర్రుకు చెం దిన టీ దుర్గాప్రసాద్‌కు స్వాతంత్ర దినోత్సవ పురస్కారం లభించింది. ప్రసాద్ అమలాపురం ఆర్టిఓ ఆఫీ స్‌లో కంప్యూటర్ ఆపరేటర్ కం టైపిస్ట్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా అమలాపురంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, అంబే ద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

స్వాతంత్ర్య వీరుల గురించి నేటి బాలలు తెలుసుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : పినపళ్లలో స్వాతంత్ర దినోత్సవ వేడు కలు అంగరంగ వైభవంగా జరిగాయి. నాటి స్వాతంత్ర వీరు ల త్యాగాల గురించి నేటి బాల లంతా తెలుసుకోవాలని సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన పతాకావిష్కరణ చేశారు. ఈ వేడుకల్లో భాగంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం నిర్వహించి నూతన వస్త్రాలు బహుకరించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. గ్రామంలో విద్యను అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థిని, విద్యార్థులకు స్థానిక కృష్ణప్రభాస్ రైస్ మిల్ యాజమాన్యం అందించిన పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ వస్తువులను అందజేశారు.

భావితరాలకు సమరయోధుల త్యాగాలు తెలియజేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : 78వ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని స్థానిక గాంధీ నగర్ 41వ వార్డు గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెం డాను వార్డు తెలుగుదేశం పార్టీ ఇం చార్జ్ తోన్నాడ వెంకటరమణ ఆవిష్కరిం చారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వతంత్ర దినోత్సవం వేడుకలను భావితరాలకు స్వతంత్ర సమర యోధుల త్యాగాలను తెలియజేసి దేశం కోసం ప్రతి ఒక్కరు త్యాగాలు కొనసా గించేలా తెలిసేందుకే ఈ ఉత్సవాలు దామోదపడతాయని ఆయన పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో పార్క్ కమిటీ సభ్యులు, వాకర్స్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ, రామచంద్రపురం : దేశవ్యాప్తంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడు కలు భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గల డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో సీనియర్ న్యాయవాది కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నాయకులు గోపాలరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఈ దేశం స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు జీవితాలు త్యాగాలు చేశారన్నారు. ఈ దేశ చరిత్రలో అర్థం చేసుకొని మనం ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగంలో హక్కులను మరియు బాధ్యతలు సక్రమంగా అందరికీ అందేలాగా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి రాము, ఎస్ శారదా దేవి, బి తాకేశ్వరావు, ఆర్ సత్తిబాబు, పి బ్రహ్మలింగేశ్వర రావు, రాజేష్, అలీ, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

నేటిబాలలే దేశప్రగతికి దిక్సూచి

విశాలాంధ్ర - ఆలమూరు : నేటి బాలలు భావి భారత పౌరులుగా ఎదుగుతూ దేశ ప్రగతికి దిక్సూచిగా నిలవాలని శ్రీసిద్ధార్థ స్కూల్ అధినేత కె ముల్లారావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపిడిఓ ఏ మేరీ రోజ్, ఎస్సై ఎం అశోక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు వద్ద 78వ స్వాతంత్రదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అలనాడు స్వాతంత్ర ఉద్యమం కోసం అనేకమంది త్యాగమూర్తులు పోరాడి మనకు స్వాతంత్రం తెచ్చారని మనకు స్వాతంత్రం వచ్చి నేటికీ 78 ఏళ్ళు పూర్తి అయిందన్నారు. నేటి యువత అలనాటి త్యాగమూర్తుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని వారి ఆశయ సాధన కోసం కృషి చేయవలసిన ఆవశ్యకత ఎం తైనా ఉందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రామ్ స్వరూప్, డిటి విజయ రేఖ, ఈవోపీఆర్డీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

స్వాతంత్ర పతాకావిష్కరణలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని, మానవ హక్కులు హరించకపోతున్నాయని, ప్రజాస్వామ్యం మాయమవుతుందని, స్వాతంత్రం కోసం త్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మోడీ విధానాలపై ప్రశ్నించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపు నిచ్చారు గురువారం ఉదయం 78వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని నగరంలో రాజ మండ్రి జట్టు లేబర్ యూనియన్ కార్యాలయం ,సీపీఐ కార్యాలయం అపరాల సెక్షన్ కార్యాలయం మల్లయ్య పేట భవన నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రి తదితర సెంటర్లో పతాకావిష్కరణలు చేశారు. అనంతరం ఆర్టిసి కాంప్లెక్స్ సమీపంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. తాటిపాక మధు మాట్లాడుతూ 200 సంవత్సరాలు పాటు పరిపాలించిన బ్రిటిష్ తెల్లదొరలు దేశాన్ని వదిలిపోవాలని భారతీయులు విజయమో వీర స్వర్గమో అంటూ ఎన్నో కష్టాలను కన్నీరును బాధలను అనుభవించి లాఠీలకు తూటాలకు ఎదు రొడ్డి నిలిచారని మధు అన్నారు. మతం కులం పక్కనపెట్టి ఒకే జాతిగా హిందూ ముస్లిం క్రైస్తవ సిక్కులందరూ ఏకమై పోరాడరాన్నారు .1919 జలియన్ వాలాబాగ్ దురంతం భారతీయులలో మరింత ఆవేశాన్ని పెంచిందన్నారు . 1915 లోనే మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుంచి వచ్చి ఏడు నెలలపాటు దేశమంతా పర్యటించి సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపు నిచ్చారన్నారు .స్వాతంత్రం కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో సీపీఐ అగ్రభాగాన ఉందని కమ్యూనిస్టు భావాలను తుంచి వేసే ప్రయత్నంలో అనేక కుట్ర కేసులను బ్రిటీష్ ప్రభుత్వం బనాయించిందని అనేక మంది కమ్యూనిస్టులను జైలు పాలు చేసి ఉరికాంబలను ఎక్కించిందని మధు అన్నారు. స్వతంత్ర అనంతరం దేశం స్వాలంబన కోసం కమ్యూనిస్టులు పోరాడారని దున్నేవానికి భూమి నినాదాన్ని ముందుకు తీసుకొచ్చి భూమి పంపిణీ చేసిందన్నారు స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ళ గడిచిన ఇప్పటికి పేదలు మరింత దరిద్రులుగా మారుతున్నారని ఆయన అన్నారు. స్వాతంత్ర ఫలాలు ఇప్పటికీ ప్రజలకు చేరి అవ్వలేదని చెరువ అవలేదని మధు తెలిపారు. జట్ల సంఘము అధ్యక్షులు , సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు మాట్లాడుతూ నేడు బిజెపి మతోన్మాదుల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనకబడిందని, అవినీతి ఆశ్రిత పక్షపాతం రాజు మేలుతున్నాయని మధు తెలిపారు ప్రశ్నించే వారిపై కుట్ర కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని ప్రజాస్వామ్యం మాయమైందని అన్నారు. ఈ తరుణంలో అన్ని రంగాల వారు వర్గాల వారు ఏకమై బిజెపి విధానాలను ప్రశ్నించాలని మధు పిలుపు నిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్, కె శ్రీనువాస్, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు సెపిని రమణమ్మ, సిడగం నౌరుజి, టీ నాగేశ్వరరావు పేపర్ మిల్ భద్రారావు , జట్ల సంగము అధికారబాడి. దేముడుబాబు, వెంకటరావు , దుర్గా ప్రసాద్ సీపీఐ నాయకులు నాగబాబు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారిగా డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరవేయడంతో పాటు జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌కు జిల్లా ఉత్తమ అధికారిగా గుర్తింపు లభించింది. ఈ మేరకు గురువారం ఏలూరులోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్ జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్జి సి. పురుషోత్తం కుమార్, జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి తదితరులు ప్రశంసాపత్రం అందజేశారు. మాజీ సైనికుడైన విశ్వనాథ్ సేవలను పౌర సమాజం గుర్తించి గతంలో ట్రూ ఇండియన్, ప్రజాబంధు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జాతీయ పురస్కారాలతో సత్కరించింది.

ఉత్తమ అధికారులకు పురస్కారాలు

విశాలాంధ్ర - పెద్దాపురం : జిల్లా ఉత్తమ శాఖాధికారులుగా పెద్దాపురంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సేవలకు స్వాతంత్య్ర దినోత్సవం పుస్కరించుకుని ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఏటా కాకినాడ జిల్లా పేరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, కలెక్టర్ షాన్ మోహన్ చేతుల మీదుగా గురువారం పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి జె సీతారామారావు, డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ డబ్యూఎస్ ఏఈ అప్పలరాజు, ఆయా శాఖల అధికారులు అవార్డులను అందుకున్నారు.ఈమేరకువారిని వివిధ విభాగాల అధికారులు అభినందించారు.

ఉత్తమ సేవా పతకాలు పొందిన ఉద్యోగులు

విశాలాంధ్ర - ఏలూరు : 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా డివిజనల్ పిఆర్ఓ సిహెచ్.కె. దుర్గాప్రసాద్, సహాయక సమాచార ఇంజనీరు కె. ధనుంజయరాజు, ఉత్తమ ఫొటో గ్రాఫర్ పి. సాగర్ ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఉత్తమ సేవా పతకాలు అందుకున్నారు.

పేదలకు అందని స్వాతంత్ర్య ఫలాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - ఏలూరు: స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్తయిన నేటికీ పేదలకు స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ విమర్శించారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్ఫూర్తి భవనంలో జాతీయ పతాకాన్ని డేగా ప్రభాకర్ గురువారం ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో కమ్యూనిస్టులు చిరస్మరణీయ పాత్ర వహించారని కొనియాడారు. పాలకులు మారినా పేద ప్రజలకు కనీస అవసరాలు లేక నేటికీ జీవితాలు దుర్భరంగా గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో తొలి 3 స్థానాలలో నిలబెడతానని ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ నేటికీ 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందిస్తున్నారంటే పేదరికం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోడీ పాలన విధానం పేదరికాన్ని పెంచే విధంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తూ మతసామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. మోడీ తిరిగి రాతియుగం నాటి పాలనను చేయడానికి కుట్ర పన్నుతున్నారని అటువంటి ప్రయత్నాలను మనందరం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబీ, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏరియా కౌన్సిల్ సభ్యులు బజంత్రీ శ్రీనివాస్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, మావూరి విజయ, నాగం అచ్యుత్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పాల్గొన్నారు.

నేటికీ మహనీయుల కలలు కల్లలే...

విశాలాంధ్ర - భీమవరం : ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన భారతావనిలో నేటికీ నిరుద్యోగం, పేదరికం, దారిద్య్రం తాండవించడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆవేదన వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను భీమవరం శ్రీనివాసా సెంటర్లో సీపీఐ స్తూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయజెండాను ఎగురవేసిన అనంతరం కోనాల మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహనుభావులు స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పేదరికం , దారిద్య్రం, నిరుద్యోగంలేని సుసంపన్నమైన దేశాన్ని వారు కాంక్షించారని, వారు కన్న కలలు నేటికీ నెరవేరకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, కిలారి మల్లేశ్వరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చినరంగనిపాలెం సెంటర్లో : స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలని ఆ దిశగా అమర వీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగా రావు అన్నారు. భీమవరం చిన రంగని పాలెం సెంటర్లో సీపీఐ స్తూపం వద్ద పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు చెల్లబోయిన గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.యాకోబు, పాల త్రిమూర్తులు, నాయుడు, టిడిపి నాయకులు చెల్ల బోయిన సుబ్బారావు, పి.అమ్ముల్యరావు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు పాటుపడాలి : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : భారతదేశ సమగ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం ఏలూరు అమీనాపేటలో ఉన్న సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎస్పీ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత కోసం పాటు పడుతూ మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. విద్యలో ముందంజలో ఉంటూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి జి.స్వరూపారాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార శాఖ సిబ్బందికి ప్రశంసా పత్రాలు...

విశాలాంధ్ర -భీమవరం : డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, పబ్లిసిటి అసిస్టెంట్ గా పని చేస్తున్న చించిలి శ్రీనివాస నెహ్రూ, రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవరకొండ సోమరాజులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలలో రాష్ట్ర జల వనరుల శాఖా మాత్యులు డాక్టర్ నిమ్మల రామా నాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.